ప్రముఖ రచయిత(త్రు)ల కథలు

# ఆరాధన

కె. ఆదర్శ సామ్రాట్

డియర్ పూజితా!

'వెన్నెల పూసే కన్నుల
వాకిటిలో నా కోవెల
పున్నవి విరిసే నవ్వుల
తోటలలో నా ఆటలు
నేనొక పచ్చని చైత్రం
పక్షుల ప్రభాత గాత్రం'

కవిత బాగుంది కదూ. అచ్చం నీలాగే. బైదిబై నేనిలా ఉత్తరం రాయడం నీకు ఆశ్చర్యంగా లేదూ.

ఏం చెయ్యను చెప్పు. పదిహేను రోజుల నుంచి పత్రికలకు కథలు రాసీ రాసీ విసుగు పుడుతుంటే, హఠాత్తుగా నీకు రాయాలని అన్పించింది. చేతిలో పెన్ను రెడీగా ఉంది. ఇంకేం. రాసేస్తున్నాను. అప్పుడప్పుడు ఇలా లోలోన కదిలే అందాల భావాలు నీలాంటి అభిమానులతో పంచుకోవాలని ఉంటుందిలే. అందుకే రాస్తున్నాను.

అన్నట్లు ఈ ఉత్తరం చూసి నన్ను అపార్థం చేసుకోవట్లేదు కదా! పొరపాటున కూడ నిన్ను కానీ, నీ అభిమానాన్ని కానీ నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. చేసుకోలేను కూడా. నువ్వు నా కంటికి మొదటిసారి కన్పించినప్పుడు ఎలాంటి చిన్న అమ్మాయివో ఇప్పటికీ అంతే.

అదే నిర్మలత్వం. అదే పసిమోము. అదే తీపి కంఠం. అవే అందమైన అద్భుతమైన చిరునవ్వులు! నీలో ఏం మార్పు వచ్చిందని నిన్ను ఇంకోలా అర్థం చేసుకోడానికి. నాలో నూ రాలేదు. కొబట్టే ఇది నీ పట్ల నాకున్న అభిమానము, వాత్సల్యము, తప్పించి ఇంకేమీ కాదు. ఉండడానికి అవకాశమూ లేదు.

నీకిలా ఉత్తరం రాస్తూ ఉంటే అద్భుతమైన నీ చిరునవ్వుల రూపం నా కంటికి కన్పిస్తూ ఉంది. హౌ లక్కీ యూ ఆర్ పూజితా! ఎందుకంటే అలాంటి చిరునవ్వులు ఈ ప్రపంచంలో చాలా అరుదుగా కానీ కన్పించవు. గ్లోరియస్ స్మైల్స్ ఆర్ దే. మార్వెలస్... బ్యూటిఫుల్... యూ ఆర్ బ్లెస్డ్ ఇండీడ్ ఫర్ హేవింగ్ సచ్ ఎ బ్యూటిఫుల్ అండ్ యాంజిలిక్ క్యారెక్టర్ ఇన్ యూ. అందుకే అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటాను. 'ఈ ప్రపంచమంతా పూజితలాంటి అమ్మాయిలతో నిండిపోతే ఎంత బాగుణ్ను' అని. నిజంగానే ఎంతో బాగుంటుంది కదా! అంతా ఒక బృందావనంలా కనిపిస్తూ, ఎటు చూసినా చిరునవ్వులే విరబూస్తూ... కానీ దేవుడికే కాస్త బుర్ర లేదు. అందుకే నీలాంటి వాళ్ళని చాలా అరుదుగా కానీ సృష్టించడు.

అయ్యయ్యో. ఏమీ రాయకుండానే ఉత్తరమంతా అయిపోయింది. ఇక ఆపేస్తానేం. చెప్పడానికి ఎన్నెన్నో ఉన్నా, ఈ చిన్న లేఖలో ఇంతేం చెప్పగలను. చెప్పలేను కదూ!

— ప్రేమతో,
శ్రావణ్ బాబు.

● ● ●

డియర్ పూజితా,

'ప్రభాతాలు పూచినపుడు
పరిమళాలు పాడినప్పుడు
శాంతి శాంతి కాంతి కాంతి
బ్రతుకంతా చైత్ర గీతి'

ఆకాశం మబ్బు పట్టేసి ఎంతో ఉల్లాసంగా ఉంది. మొన్న నీకు రాస్తూ ఉన్న ఉత్తరం హటాత్తుగా ఆపేయడంతో మళ్ళీ నీకు రాయాలని అన్పించింది.

పూలరెమ్మలు మనసులో ఊగుతున్నప్పుడు, మంచువానలు హృదయంపై కురుస్తున్నప్పుడు, విన్పించని ఏ సంగీతమో నీ అణువణువునా మోగుతున్నప్పుడు. ఇలాగే ఏదో ఒకటి హఠాత్తుగా చేయాలని ఉంటుందట.

కొన్నిటికి కారణాలు ఉండవు.

అవి మాత్రమే ఉంటాయి.

అన్నట్లు ఓ సన్నజాజీ! కవిత్వాన్ని ప్రేమిస్తూ, ప్రేమిస్తూ— ఇప్పుడు నేనే ఓ కవిత్వంలా మారిపోయాను. ఇప్పుడు చెయ్యి కదిపితే కవిత, నోరు మెదిపితే కవిత, గాఢమైన సుషుప్తిలో పలవరించినా కవితే, అసలు నా మనసే ఓ కవిత్వంలా మారిపోయింది. ఈ భావం ఎంత మనోజ్ఞంగా ఉందో నీకు అర్థమౌతోందా పూజితా?

జ్ఞానం కోసం తపస్సు చేస్తూ చేస్తూ నేను ప్రేమను తెలుసుకున్నాను. భగవంతుడి హృదయంలోని ప్రేమ! స్వార్థం, ఆశ, వంచన ఏదీ లేని అతి నిర్మలమైన ప్రేమ! అందుకే... అందుకే... ఇప్పుడు నేను ప్రతిచోటా సౌందర్యాన్ని చూస్తున్నాను. చెట్ల ఆకుల్లో, పూల రెక్కల్లో, మిణుకు మిణుకు పాటలతో పలకరించే చుక్కల్లో, వెన్నెల్లో, సంధ్యల్లో, పసిపాప నవ్వుల్లో— అన్నిటి కలబోతలాంటి అందమైన పూజితలో... ఇప్పుడు నేను సౌందర్యాన్ని చూస్తున్నాను.

పూజితా!

ఈ ఉత్తరం చదివి నువ్వు నన్ను అపార్థం చేసుకుంటావేమో అనే భయం నాకు లేదు. నా మనసులో ఓ రవ్వంత కల్మషం ఉన్నా నేనలా భయపడేవాడిని. కానీ ఏమీ లేదు పూజితా. నా మనసులో ఏమీ లేదు. ఉంటే ఈ ఉత్తరం ఇంకోలా ఉండి ఉండేది. ఒక తల్లికి, తన బిడ్డల మీద ఎలాంటి ప్రేమ ఉంటుందో, అచ్చం నీ మీద కూడా నాకు అలాంటి ప్రేమే ఉంది. ప్రేమ! దట్సాల్! ఇన్ ఇట్స్ ఒరిజినల్ అండ్ ట్రూత్ ఫుల్ ఫామ్. అందరికీ ఇది అర్థం కాకపోయినా, నీకు సైతం అర్థం కాకపోయినా కనీసం భవిష్యత్తులోనైనా నీకు అర్థమై తీరుతుంది.

అబ్బ! ఎంత అందమైన ఉత్తరం ఈమాట




య్యింది! మాధవుడి రాధ హృదయంలా... మువ్మాటికీ, ఇలాంటి ఉత్తరాలు రాసేవాళ్ళు కాదు, రాయించుకునే వాళ్ళే అదృష్టవంతులు. నువ్వు వాలా అదృష్టవంతురాలివి పూజితా... ఈ భావాలు పంచుకున్నందుకు.

— ప్రేమతో,
శ్రావణ్ బాబు.

● ● ●

దేవతల చిరునవ్వు నుంచి జారిపడిన అమ్మాయీ—

ప్రియమైన పూజితా!

కొన్ని కొన్ని బావుంటాయి.

వెన్నెల్లో తిరగడం, సన్నజాజులు తురమడం, పిల్లలతో ఆడడం, కవిత్వాన్ని పాడడం, ఒక పూజితకు ఇలా... మనసారా ఓ ఉత్తరం రాయడం... వాలా వాలా బాగుంటాయి. హృదయంతో బ్రతికే వాళ్ళకి చక్కటి అనుభూతులివి. అందుకే ఏమీ కోరక పోయినా, కేవలం ఆ అనుభూతి కొరకే మరో ఉత్తరం నీకు రాస్తున్నాను. మనుషుల కంటే, మనుషుల స్వరూప స్వభావాల కంటే, అనుభూతులు అమూల్యమైనవి. వాటిని కోల్పోకూడదు.

నిన్న ఇక్కడ వర్షం పడింది. వడగళ్ళ వాన! అందుకే ఈనాటి ఎండలో ఏదో వింత సోయగం. దుమ్ము ధూళీ దులిపేసుకున్న చెట్లు పచ్చని అందంతో మెరుస్తున్నాయి. కాకి కేక కూడా పాటలాగే ఉంది. ప్రకృతి స్వచ్ఛంగా ఉన్నప్పుడు ప్రతీదీ దివ్యంగా వెలుగుతుంది. ఇదిగో — ఈ క్షణం కూడా...

'పుణ్యక్షేత్ర మీా హృదయం
అగ్నితప్త యజ్ఞ స్తలం
దేవతలారా రండి
ఈ హృదిలో వసించండి'

అని ఒకానొకప్పుడు ఎలుగెత్తి అరచిన హృదయం నాది. ఈ రోజు నిజంగానే వా హృదయంలో దేవతలు పాడుతున్నారు. నేను పుట్టకముందు నుంచి నాలో పెరుగుతూ వచ్చిన సౌందర్యలతలు ఇప్పటికీ పూలు పూచి వెన్నెల్ని పంచుతున్నాయి. అద్భుతమైన వెన్నెల! అందరితో పాటు ఈ వెన్నెల నీ మీాద కూడా కురిస్తే...? అయినా ఇప్పుడు కురవడం లేదా ఏం. చక్కగా కురుస్తూ

ఉంది. ఎంతైనా వెన్నెల వెన్నెలేగా— జస్ట్ నీ నవ్వులాగా.

ఎలా ఉన్నావు పూజితా!

నా ఉత్తరాల్లో ప్రశ్నలూ వార్తలూ ఏమీ ఉండవు. అందం మాత్రమే ఉంటుంది. ఎవరికి రాసినా అంతే. చూసే కళ్ళు మూడగలవని నా చెక్కుచెదరని నమ్మకం.

ఇక ఉంటాను జాబిలీ.

— ప్రేమతో,
శ్రావణ్ బాబు.

హే సాంగ్ ఆఫ్ గంగా!

ప్రియమైన పూజితా!

'ఏ తపస్సు రూపుదాల్చి
ఈ ఉషస్సు విరిసిందో
ఏ తమస్సు వీలిపోయి
కాంతిబాట పరిచిందో
మానవుడా
మహాత్ముడా
సౌందర్యపు ఈ ఉదయం
నీ జీవిత సౌభాగ్యం'

ఉదయాలు ఎక్కడ ఉంటాయి పూజితా? పసిపాపల హృదయాల్లో కాదూ? పూజితల నవ్వుల్లో కాదూ? "నో" అని జవాబు చెప్పే వీలు లేదు. నువ్వు ఒప్పుకోవలసిందే.


ఒక నవ్వు నీ హృదయాన్ని జల్లుతా తడిపేసినప్పుడు— ఆ ఆర్ద్రత నుంచి పుట్టే జాజిలత ఎంత సొగసుగా ఉంటుందో తెలుసా. ఇదిగో అచ్చం నా ఉత్తరాల్లా... ఒప్పుకుంటావు కదూ.

పూజితా!

ఇదే నా ఆఖరి లేఖ కావొచ్చు. ఇంతకు మించి నేనేమీ రాయలేకపోవచ్చు. నిజానికి రాయలేను కూడా. ఒక కోరికనో, ఒక అనుభవాన్నో, ఒక సంఘటననో అతి తేలికగా మాటల్లో రాయవచ్చు. కానీ ఒక అనుభూతిని, ఒక ఉజ్వలతని, ఒక ఆత్మగీతని ఎవరు మాత్రం మాటల్లో పెట్టగలరు?!

నా హృదయాన్ని అక్షరాలలా మార్చలేనని తెలిసి కూడా నీకు రాయకుండా ఉండలేకపోయాను. కేవలం ఓ అనుభూతి కోసం! ఓ కమ్మని మహానుభూతి కోసం!

ఎందుకోగాని నీకు రాస్తున్నప్పుడు నా మనసంతా హాయిగా మారిపోతుంది. ఈ ప్రపంచంలోని కుళ్ళూ, ద్వేషమూ; వంచనా, అన్నీ మాయమైపోయి, కేవలం ఒక అందం



కె. ఆదర్శ సామ్రాట్

మాత్రమే మిగిలినట్లుగా అవుతుంది. నా ఆత్మలోని అణువు అణువు పవిత్రంగా, ప్రశాంతంగా, సృష్టికర్త హృదాంతరాళం లోని మౌనంలా మారిపోతుంది. ఆ మౌనం కోసమే, ఆ మౌనంలో దొరికే దివ్యత్వం కోసమే నేను నీకు రాస్తున్నాను. అంతకు మించి ఇంకేమీ లేదు పూజితా.

నా నిండా ఉదయాలు నింపిన ఓ హృదయమా. ఇక ఉండనా.

— ప్రేమతో,
శ్రావణ్ బాబు.

● ● ●

ప్రియమైన మాస్టారూ,

మీ నాలుగు కావ్యాలు అందుకున్నాను. వాటిలో ఎక్కడా నాకు అక్షరాలు కన్పించలేదు. మాటలు కూడా కన్పించలేదు. కేవలం మీ హృదయం మాత్రమే కన్పించింది. మీ ఆత్మనిండా తొణుకుతూ ఉన్న సౌందర్యం మాత్రమే కన్పించింది. మీరన్నట్లు నిజంగానే నేను అదృష్టవంతురాలిని మాస్టారూ. చాలా చాలా అదృష్టవంతురాలిని.

మీ ఉత్తరాలు చదివినప్పుడు నా మనసులో కలిగిన అనుభూతిని ఏ మాటల్లో చెప్పగలను. నా మనసు, శరీరము. రెండూ మాయమై, నేను దేవుడి పూజలో వెలిగే హారతిలా మారానని అన్పించింది. చెట్లన్నీ పూలు పూసినపుడు— ఆ పూతలోని సౌందర్యమంతా నాదేనని అన్పించింది. అప్పుడప్పుడు పూలజల్లులా సన్నటి వానజల్లు కురుస్తుంది చూడండి— ఆ జల్లులోని సంగీతాన్ని, ఆ సంగీతంలోని ఆనందాన్ని నేనేనని అన్పించింది. ఇంకా ఇంకా ఎన్నెన్నో అన్పించాయి మాస్టారూ. కానీ వాటన్నిటిని నేనెలా చెప్పగలను?

అన్నిటికన్నా అద్భుతమైన అనుభూతి ఏమిటో చెప్పనా. నేను మీకంటే పదిహేనేళ్ళ చిన్నదాన్ని అయినప్పటికీ— నేను మీ కంటే ఎంతో పెద్దదాన్ననీ, ఈ విశ్వమంతటినీ నాలో పొదువుకున్నాననీ, మీకు, మీ సౌందర్యానికి, ఈ సృష్టికి, అన్నిటికి నేనే తల్లిననీ, ఇవన్నీ, ఇదంతా ఈ సృష్టిలో కనిపించే ప్రతి అణువూ నా నుంచే పుట్టాయని— నాలోనే ఉన్నాయని... ఏమిటో! స్పష్టంగా చెప్పలేను మాస్టారూ. కానీ అద్వితీయమైన అనుభూతి అది. జన్మకు ఒకసారి వచ్చినా చాలనిపించే అనుభూతి!

ఉజ్వలమైన అనుభూతి!! చాలు మాస్టారూ చాలు. ఈ జన్మకు ఈ ఆనందం చాలు. నా యీ చిన్ని హృదయంలో ఎన్ని సముద్రాలూ, ఆకాశాలూ వ్యాప్తి చెందాయో, ఎన్ని చైత్రాలూ, ఉషస్సులూ పురులు విప్పాయో... నేను చెప్పలేను. 'ఓ ప్రభూ, నాకు జీవితాన్ని ఇచ్చినప్పుడు ఆ జీవితానికి అర్థాన్నీ తెలియ చేయి...' ఈ రోజు నిజంగానే ఆ అర్థాన్ని తెలుసుకున్నాను మాస్టారూ. ఆ అర్థంలోని పరమార్థాన్నీ తెలుసుకున్నాను.

మాస్టారూ!

ఇప్పటివరకూ నేను మీ కళను మాత్రమే ప్రేమించాను. ఇప్పుడు మాత్రం ఆ కళకంటే ఎన్నో రెట్లు గొప్పదైన మీ హృదయాన్ని ప్రేమిస్తున్నాను.

ఇది వరకు— "మే మిద్దరమూ ఒకే ఇంట్లో పుట్టి ఉంటే ఎంత బాగుణ్ణు" అనుకొనే దాన్ని. ఇప్పుడు మాత్రం నాకు మీ చెల్లిగా కాని, తల్లిగా కాని కావాలని లేదు. మీకు ఒక భార్యగానో, ప్రేయసిగానో కూడా ఉండాలని లేదు. కానీ... కానీ... నాకు మీ హృదయంలా ఉండాలని ఉంది మాస్టారూ.

అచ్చం మీ హృదయంలా. సరిగ్గా నాకు మీ హృదయంలా బ్రతకాలని ఉంది మాస్టారూ.

'హే ప్రభో. నీ ముంగిట్లో ఆడుకొనే పసివాళ్ళం మేము. మా నవ్వుల్ని పెంచవూ తండ్రీ.'

ఎందుకో కన్నీళ్లొస్తున్నాయ్ ... ఇక ఉండి పోతాను మాస్టారూ.

— ప్రేమతో
మీ
పూజిత